
సాక్షి
కుమురం భీం
సోమవారం, 9, అక్టోబర్, 2023



దోమ తెరలేవి?

ఏజెన్సీ పరిధిలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఇప్పటికే డెంగీతో పలువురు మృత్యువాత పడ్డారు. దోమతెరలు పంపిణీ చేయాలని గిరిజనులు కోరుతున్నారు. 8లో▸



కస్తూరిబా విద్యార్థినులకు అస్వస్థత

కన్నెపల్లి మండల కేంద్రంలోని కేజీబీవీ విద్యార్థినులు 18 మంది అస్వస్థతకు గురికాగా 12 మందిని మెరుగైన చికిత్స కోసం బెల్లంపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. 10లో▸

గరిష్టం/కనిష్టం
35.5 /24.3

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశంలో అక్కడక్కడా మబ్బులు ఉంటాయి. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వేడి, ఉక్కపోత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

317 జీవో రద్దు చేయాలి



మాట్లాడుతున్న కార్తీక్

ఆసిఫాబాద్‌అర్బన్: నిరుద్యోగులకు అన్యాయం చేసే 317 జీవో రద్దు చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు టీకానంద్, ప్రధాన కార్యదర్శి కార్తీక్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ 317 జీఓ ద్వారా జిల్లాలో భర్తీ చేయాల్సిన పోస్టులు పూర్తిగా తగ్గిపోతుండడంతో ఎన్నో ఏళ్లుగా ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగులు నిరుత్సాహానికి గురవుతున్నారన్నారు. కాగజ్‌నగర్ ఎస్పీఎంలో జిల్లావాసులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, ప్రభుత్వ ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని, జిల్లా వ్యాప్తంగా మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని, గ్రంథాలయాలు, స్టడీ సర్కిళ్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో శ్రీకాంత్, సతీష్, రాజేశ్, సవిత, కుర్మిత, లక్ష్మి, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

'అమిత్‌షా సభ విజయవంతం చేయాలి'

ఆసిఫాబాద్‌అర్బన్: ఈ నెల 10న ఆదిలాబాద్‌లో నిర్వహించనున్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా బహిరంగసభను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 2 నియోజకవర్గాల్లో బీజేపీ విజయకేతనానికి కృషిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్, సెర్ల మురళి, సొల్లు లక్ష్మి, సునీల్, రమేశ్‌గౌడ్, వెంకటేశ్, బాలక్రిష్ణ, శ్రీధర్, శివాజీ, సుచిత్, శ్రీనివాస్, జగన్, ప్రవీణ్, గోపాల్ పాల్గొన్నారు.

కుమురం భీం ఉత్సవ కమిటీ ఎన్నిక



ఆత్రం బొజ్జిరావు



పెందోర్ లక్ష్మణ్

కెరమెరి(ఆసిఫాబాద్): కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలోని జోడేఘాట్‌లో ఈ నెల 28న కుమురంభీం 83వ వర్ధంతి సందర్భంగా రాయిసెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉత్సవ కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కుమురం సోనేరావు, చైర్మన్‌గా ఆత్రం బొజ్జిరావు, కన్వీనర్‌గా పెందోర్ లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శులుగా మడావి రాజు, కుమురం ఎశ్వంత్‌రావు, సభ్యులుగా కేన్యానేశ్వర్, రామారావు, ఎస్.ఆనంద్‌రావు, కే.దత్తు, ఏ.సోనేరావు, ఏ.చందన్‌శావ్, ఎల్లయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

దసరాకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

ఆసిఫాబాద్: దసరా పండుగను పురస్కరించుకుని ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. ఈ నెల 12 నుంచి జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో నుండి హైదరాబాద్‌కు ప్రత్యేక బస్సులు నడిపేందుకు ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లా కేంద్రం నుండి ప్రతీరోజు హైదరాబాద్‌కు 16 సర్వీసులు నడుపుతుండగా అదనంగా 10 బస్సులు నడిపేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు డిపో మేనేజర్ శ్రీధర్ తెలిపారు.

అప్‌డేట్ తిప్పలు



ఆధార్ సెంటర్ ఎదుట నిరీక్షిస్తున్న జనం

- ఆధార్ కేంద్రాల వద్ద క్యూలైన్
- అప్‌డేట్ అయితేనే రేషన్, ఆరోగ్యశ్రీ..
- అధికంగా వసూలు చేస్తున్న నిర్వాహకులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో ఆధార్ అప్‌డేట్‌కు చిన్నారులు, పెద్దలు ఇబ్బంది పడుతున్నారు. రేషన్ కార్డు, ఆరోగ్య శ్రీ, సెల్‌నంబర్ లింక్ కోసం ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి కావడంతో ఆధార్ సెంటర్లకు ప్రజలు పరుగులు పెడుతున్నారు. ఇదే అదునుగా భావించిన ఆధార్ కేంద్రాల నిర్వాహకులు అదనంగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 11 ఆధార్ కేంద్రాల ఏర్పాటుకు అనుమతి ఇచ్చారు. వాటిలో కెరమెరి, జైనూర్, లింగాపూర్, సిర్పూర్(యూ), దహెగాం, కౌటాల, సిర్పూర్(టి), చింతలమానెపల్లి ఆధార్ సెంటర్ల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో అధికారులు పర్మిషన్ రద్దు చేశారు. దీంతో ఆయా మండలాల ప్రజలు జిల్లా కేంద్రంలోని ఆధార్ కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు.

జిల్లాలో 11 సెంటర్లు...

జిల్లా వ్యాప్తంగా 11 ఆధార్ సెంటర్లను ప్రభుత్వం నుంచి ఏర్పాటు చేశారు. కానీ నిర్వాహకులు ప్రజల నుంచి అధిక మొత్తంలో వసూలు చేస్తుండడం, తదితర కారణాలతో 8 సెంటర్లను రద్దు చేశారు. ప్రస్తుతం మూడు కేంద్రాలు మాత్రమే సక్రమంగా కొనసాగుతున్నాయి. వీటితో పాటు కొన్నింటిని ఏజెన్సీ వారు ప్రత్యేక సర్వీస్ సెంటర్లను బ్యాంకుల్లో ఏర్పాటు చేసి సేవలు అందిస్తున్నారు. వీటిలో తీసుకోవాల్సిన చార్జీల కంటే ఎక్కువ తీసుకుంటున్నారు. ఏజెన్సీ ద్వారా ఏర్పాటు చేసుకున్న ఆధార్ సర్వీస్ సెంటర్లలో ఇష్టానుసారంగా చార్జీలు తీసుకుంటున్నారు. ప్రజల అవసరాన్ని బట్టి రూ.100 నుంచి వెయ్యి వరకు తీసుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేక పోవడంతో నిర్వాహకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు.

తీసుకోవాల్సిన చార్జీలు ఇలా...

ఆధార్ సర్వీస్ సెంటర్‌లో ఆధార్ ఎన్రోల్మెంట్, మోనిటరీ బయోమెట్రిక్ డెమోగ్రాఫిక్ అప్‌డేట్‌కు ఎలాంటి చార్జీలు తీసుకోవద్దు. డెమోగ్రఫీ అప్‌డేట్‌కు రూ.50, డాక్యుమెంట్ అప్‌లోడ్ రూ.50, మోనిటరీ బయోమెట్రిక్ విత్ డెమోగ్రఫీ అప్‌డేట్‌కు రూ.100, బయోమెట్రిక్ అప్‌డేట్ విత్ డెమోగ్రఫీ అప్‌డేట్ రూ.100, అడిషనల్ రిసైడ్‌కు రూ.350, హోమ్ ఎన్రోల్మెంట్ అప్‌డేట్ సర్వీస్‌కు రూ.700, డౌన్‌లోడ్ ప్రింట్‌కు రూ.30 తీసుకోవాల్సి ఉంటుంది. కానీ ఫ్రీగా చేయాల్సిన వాటికి కూడా రూ.100 నుంచి రూ.200 తీసుకుంటున్నారు. ఉచితం అనేది ఎక్కడాలేని పరిస్థితి.



నమోదు చేస్తున్న సిబ్బంది

అప్‌డేట్ తప్పనిసరి

ప్రస్తుతం రేషన్‌కార్డు లబ్ధిదారుల ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి చేయడంతో ప్రతి ఒక్కరూ అప్‌డేట్ కోసం ఆధార్ సెంటర్‌కు రావాల్సిన పరిస్థితి ఉంది. ఆధార్ నంబర్‌కు సెల్‌నంబర్ లింక్, ఈకేవైసీ ఉండాలి. దీంతోపాటు ఇటీవల వ్యవసాయ శాఖ వారు పత్తిని సీసీఐకి అమ్ముకునేందుకు తప్పనిసరిగా బయోమెట్రిక్ విధానం ఉంటుందని, ఆధార్ కార్డుకు అప్‌డేట్‌తో పాటు సంబంధింత బ్యాంకు ఖాతానంబర్‌కు కూడా లింక్ అయి ఉండాలని చెప్తున్నారు. దీంతో తప్పనిసరి పరిస్థితిలో ఆధార్ అప్‌డేట్ చేసుకుంటున్నారు.

రూ.1500 తీసుకున్నారు



మా బాబు ఆధార్‌కార్డు, బోనఫైడ్‌కు పుట్టినతేది సరి పోకపోవడంతో మూడు నెలల క్రితం జిల్లా కేంద్రంలోని యూనియన్ బ్యాంకులో ఉన్న ఆధార్ సెంటర్‌కు వెళ్తే రూ.1500 తీసుకుని ఎన్‌రోల్‌మెంట్ ఇచ్చారు. కానీ ఇప్పటి వరకు కొత్త ఆధార్ కార్డు ఇవ్వలేదు. అడిగితే టైం పడుతుంద ని అంటున్నారు.

– సంతోష్, అప్పపల్లి, ఆసిఫాబాద్

వాంకిడి నుంచి వచ్చా..



రేషన్ కార్డుకు వేలిముద్ర పడాలంటే ఆధార్ కార్డు అప్‌డేట్ చేసుకోవాలని రేషన్ డీలర్ అంటున్నారు. మా బాబును తీసుకుని ఆధార్ సెంటర్‌కు వచ్చా. ఉదయం వస్తే బాగా మంది ఉన్నారు. సాయంత్రం 6 గంటల వరకు ఉండాల్సి వచ్చింది.

– ఆర్.భీంరావు, వాంకిడి

రూ.150 తీసుకుంటున్నారు



ఆధార్ సెంటర్‌లో ఫోన్‌నంబర్ లింక్ చే సేందుకు రూ.150 తీ సుకుంటున్నారు. సెంటర్‌లో ధరల పట్టిక లేకపోవడంతో నిర్వాహకులు ఇష్టానుసారంగా తీసుకుంటున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి అధిక వసూలుపై తగిన చర్యలు తీసుకోవాలి.

– జీవన్, రాంజీగూడ, జైనూర్

'ఆశ'లు విలవిల

- చాలీచాలని వేతనంతో ఇబ్బందులు
- పనిభారంతో కుంగిపోతున్న వైనం
- సమ్మెకు దిగినా ఫలితం శూన్యం
- గ్రామాల్లో ఎక్కడి పనులు అక్కడే..



కెరమెరిలో ధర్నా చేస్తున్న ఆశ కార్యకర్తలు

కెరమెరి(ఆసిఫాబాద్): వైద్యరంగంలో కీలక పాత్ర పోషించే ఆశ కార్యకర్తలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నారు. చాలీచాలని వేతనాలు, పని ఒత్తిడి, అధికారుల వేధింపులతో సతమతమవుతున్నారు. ఇంటింటా తిరిగి ప్రజల యోగక్షేమాలు తెలుసుకునే ఆశ కార్యకర్తలపై ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయి. 2005 నుంచి సేవలందిస్తున్నా ఆశ కార్యకర్తల పరిస్థితి 'వేతనం మూరేడు.. చాకిరి బారెడు' అన్నట్లుగా తయారైంది.

15 రోజులుగా సమ్మె చేస్తున్నా..

సమస్యలు పరిష్కరించాలని 15రోజులుగా ఆయా మండలాల్లో సమ్మె చేస్తున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి హామీ రాలేదు. ఆశ కార్యకర్తలు సమ్మెకు దిగడంతో గ్రామాల్లో సేవలు నిలిచాయి. జిల్లాలో 18 పీహెచ్‌సీలు, 105 ఉపకేంద్రాలుండగా 747 మంది ఆశ కార్యకర్తలు విధులు నిర్వహిస్తున్నారు.

నిర్వర్తించాల్సిన విధులు

ఆశ కార్యకర్తలు స్థానికంగా ఏఎన్ఎంలకు సహాయకారిగా గ్రామాల్లో ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా వెంటనే మండల ఆరోగ్య అధికారులకు సమాచా రం ఇవ్వాల్సి ఉంటుంది. ఇంటింటా తిరిగి వ్యాధు ల సర్వేలో సహకరించాలి. పౌష్టికాహారం, ఆరోగ్య యోగక్షేమాలు, పారిశుధ్యం, గర్భిణుల సమాచా రం ఎప్పటికప్పుడు తెలుసుకుని ఆరోగ్యకేంద్రాలకు చేరవేయాలి.

అదనంగా చేయిస్తున్న పనులు

గతంతో పోలిస్తే ఆశ కార్యకర్తలపై పనిభారం విపరీ తంగా పెరిగింది. ఇందులో పారితోషికం లేని పను లే అధికంగా ఉన్నాయి. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పల్లె దవాఖానాల్లో ఉండాలి. మందుల డబ్బాలు ఆశ కార్యకర్తలతో మోయిస్తున్నారు. నిత్యం ఆన్‌లైన్ నమోదుతో ఇబ్బందులు పె డుతున్నారు. వీటిని నిలిపివేయాలని ఎప్పటినుంచో వారు కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదు. మాతాశిశు సంరక్షణ పనులు అధికంగా ఆశ కార్యకర్తలే నిర్వహిస్తున్నారు. ఆశ కార్యకర్తల వ్యవస్థ ప్రారంభం నుంచే దేశంలో మాతాశిశు మరణాల రేటు తగ్గిందని దేశ ఆరోగ్య గణాంకాలు చెబుతున్నాయి. 2021 నుంచి ఆశ కార్యర్తలకు నెలకు రూ. 9,750 పెంచింది. కానీ.. చాలా మందికి రూ.8వేల నుంచి రూ.9వేల వరకు మాత్రమే వేతనం అందుతోంది. అయినా ఆశ కార్యకర్తల సమస్యలపై ప్రభుత్వాలు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయి.

ఇవీ డిమాండ్లు

- పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పారితోషికం నెలకు రూ.18వేలు ఇవ్వాలి.
- పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలి.
- హెల్త్ కార్డులు ఇవ్వాలి.
- రూ.5లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలి.
- రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద రూ.5లక్షలు ఇవ్వాలి.
- సంక్షేమ పథకాన్ని వర్తింపజేయాలి.
- ఏఎన్ఎం, జీఎన్ఎం పోస్టుల్లో ప్రమోషన్ కల్పించాలి. ఉద్యోగాల్లో వెయిటేజ్ మార్కులు ఇవ్వాలి.
- పారితోషికం లేని అదనపు పనులు చేయించకూడదు.
- టీబీ మందుల డబ్బాలు మోసే పనులు చేయించకూడదు.
- టీబీ, లెప్రసీ పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి.
- జాబ్ చార్టును విడుదల చేయాలి.. పనిభారం తగ్గించాలి.
- 2021 నుంచి డిసెంబర్ 6వరకు పీఆర్సీ ఏరియర్స్ వెంటనే చెల్లించాలి.
- కేంద్రం చెల్లించిన కరోనా అలవెన్స్ నెలకు రూ. వెయ్యి చొప్పున 16 మాసాల బిల్లు చెల్లించాలి.
- 32 రకాల రిజిష్టర్లను వెంటనే ప్రింట్ చేయించి ఇవ్వాలి.
- క్వాలిటీతో కూడిన ఐదేళ్ల యూనిఫాం అందించాలి.
- ప్రసూతి సెలవుల సర్క్యులర్‌ను విడుదల చేయాలి.

పనికి తగిన వేతనమివ్వాలి



మాపై దినదినం పనిభారం పెంచుతున్నారు. అందుకు తగినట్లు వేతనాలు మాత్రం ఇవ్వడం లేదు. నిత్యం ఆన్‌లైన్ పనులతో సతమతమవుతున్నాం. పారితోషికాలు ఇవ్వకుండా అనేక పనులు చేయిస్తున్నారు. పనిభారం తగ్గించాలి.

– అరుణ, ఆశ కార్యకర్త, మోడి, కెరమెరి

ఆరోగ్య బీమా వర్తింపజేయాలి



నిత్యం గ్రామాల్లో తి రుగుతున్నాం. ప్రజల వ్యాధుల సమాచారా న్ని ఎప్పటికప్పుడు అధికారులకు తెలియజేస్తున్నాం. మాకు హెల్త్, గ్రూపు ఇన్సురెన్స్ లాంటి పథకాలు వర్తింపజేయాలి. ఆరోగ్య భద్రత కల్పించాలి.

– ఇస్లావత్ లలిత, ఆశ కార్యకర్త, గౌర్యాగూడ, కెరమెరి

'మహాసభలు విజయవంతం చేయాలి'

కాగజ్‌నగర్‌టౌన్: డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) ఆధ్వర్యంలో ఈ నెల 15, 16, 17 తేదీల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహించనున్న 5వ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక (రజతోత్సవ) మహాసభలను విజయవంతం చేయాలని నాయకులు డి.విస్తారు, శ్రీనివాస్, నాందేవ్ కోరారు. ఆదివారం డీఆర్‌సీ భవన ఆవరణలో పోస్టర్ ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఈ మహాసభల్లో నూతన విద్యా విధానం 2020, నేటి సమాజంలో రాజకీయ ఆర్థిక పరిస్థితులు, వ్యవసాయరంగం, రైతాంగ ఉద్యమాలు, ప్రభుత్వ పాలనలో ప్రజల హక్కులు, తదితర అంశాల పై అధ్యయనం, చర్చ జరుగుతుందని వారు పేర్కొన్నారు.

గల్లీ నుంచి ఢిల్లీకి..

- జాతీయ ఇన్‌స్పైర్ పోటీలకు జిల్లా విద్యార్థులు
- అత్యుత్తమ ప్రాజెక్టులతో రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా..
- న్యూఢిల్లీలో నేటి నుంచి జాతీయ ప్రదర్శనలు
- ఆల్‌ది బెస్ట్ చెబుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



మంచిర్యాలఅర్బన్: పాఠశాల విద్యార్థుల్లో సృజనాత్మకత, వినూత్న ఆలోచనలు, సంస్కృతిని పెంపొందించడానికి నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్–ఇండియా ఆధ్వర్యంలో ఇన్‌సైన్స్ పర్స్యూట్ ఇన్‌స్పైర్ రీసెర్చ్(ఇన్‌స్పైర్ మనక్) అవార్డుకు జాతీయ స్థాయి పోటీలు నిర్వహిస్తోంది. ఈ ఏడాది నిర్వహించే పోటీలకు జిల్లా నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. జనవరిలో నిర్మల్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రాజెక్టు ప్రదర్శనతో జాతీయస్థాయికి ఇద్దరు ఎంపికయ్యారు. న్యూఢిల్లీలో ఈనెల 9 నుంచి 11 వరకు నిర్వహించే జాతీయ పోటీలకు రాష్ట్రం నుంచి 26 మంది తమ ప్రాజెక్టులను ప్రదర్శించనున్నారు.

గతంలోనూ మెరిసిన విద్యార్థులు..

సర్కారు బడిలో చదువుతున్నా తన మేదస్సుకు పదునుపెట్టి జాతీయస్థాయిలో మల్లేపల్లి ఆశ్రమ పాఠశాల విద్యార్థి జుమ్మిడి అంజన్న తనప్రదర్శనతో ఆకట్టుకున్నారు. 2019–20లో జాతీయస్థాయి పోటీల్లో ఫీడింగ్ చాంబర్ ప్రాజెక్టుతో ఉత్తమ ప్రదర్శనతో నాలుగో స్థానంలో నిలిచారు. 2019లో నెన్నెల జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన నవీన్‌కుమార్ ఇన్‌స్పైర్ మనక్‌లోప్రోత్సాహక బహుమతి సాధించారు. చెరువులు, వాగులు, సరస్సుల్లో నిండిన చెత్తను సౌరశక్తి విధానం ద్వారా తొలగించటానికి రూపొందించిన గార్బేజ్ రిమూవర్ ఫర్ స్వచ్ఛ వాటర్ అనే ప్రదర్శనతో మెప్పించారు. 2020–21లో శ్రీచైతన్య పాఠశాలకు చెందిన సాయిలు సాయిశ్రీవల్లి రూపొందించిన ఋతుమిత్ర కిట్ పరికరంతో జాతీయస్థాయిలో ఆకట్టుకుంది.

అనారోగ్యంతో ఆదిలాబాద్ విద్యార్థి గైర్హాజరు

ఆదిలాబాద్‌టౌన్: తన మేదస్సుకు పదును పెట్టి నూతన ఆవిష్కరణ తయారు చేసిన జిల్లా విద్యార్థి అనారోగ్యంతో జాతీయ ఇన్‌స్పైర్ మేళాకు దూరమయ్యాడు. ఆదిలాబాద్ పట్టణంలోని యూపీఎస్ ఖానాపూర్‌కు చెందిన మహ్మద్ కాసిఫ్ 8వ తరగతి చదువుతున్నాడు. ఆటోమెటిక్ క్రాఫ్ట్ డ్రయర్ తయారు చేశాడు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన మేళాలో ప్రదర్శించాడు. నిర్మల్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రదర్శన కనబర్చడంతో జాతీయస్థాయి ఇన్‌స్పైర్ మేళాకు ఎంపికయ్యాడు. ఈనెల 9 నుంచి 11 వరకు ఢిల్లీలో ప్రాజెక్ట్ ప్రదర్శనలు కొనసాగుతున్నాయి. కాసిఫ్ ఇటీవల ఆయన అనారోగ్యం బారిన పడడంతో ఈ మేళాలో పాల్గొనకుండా దూరమయ్యాడని సైన్స్ అధికారి తెలిపారు.

రెయిన్ ప్రొటెక్టర్..

– ప్రాజెక్టుతో మణిప్రసాద్, జెడ్పీహెచ్ఎస్, అన్నారం, కోటపల్లి

రైతులు పండించిన పంటని ఆరబోసినప్పుడు సమయానికి అన్నదాతలు అందుబాటులో లేని సమయంలో వర్షం కురిస్తే ధాన్యం తడిసిపోతుంది. లేదా పంటను పశువులు తినడం లేదా చిందరవందరగా చేస్తాయి. దీనిని నివారించేందుకు రెయిన్ ప్రొటెక్టర్ (ప్రరెయిన్ అండ్ ఎనిమిల్స్ ప్రాజెక్టు దోహదం చేస్తుంది. కర్రలు, ప్లాస్టిక్ పైపులు, కవర్లు, రైన్ సెన్సార్, మోటార్ ప్రోగ్రామింగ్ మైక్రో కంట్రోలర్, సోలార్ ప్లేట్, 12 వోల్టేజ్ బ్యాటరీ ఐసుపతి, బజార్ 1.5వీ బ్యాటరీలతో ప్రాజెక్టును రూపొందించారు. పశువుల బారి నుంచి కాపాడుకోవటం.. వర్షం పడినప్పుడు ధాన్యం తడవకుండా ఆటోమెటిక్ యంత్రంతో ధాన్యాన్ని కప్పి ఉంచి పంటను కాపాడుకోవటమే ప్రాజెక్టు ఉద్దేశం.

డ్రెయినేజీ అండ్ రోడ్ క్లీనర్..

– ప్రాజెక్టుతో కందుల ఖుషీంద్రవర్మ, గుడ్ షెపర్డ్ హైస్కూల్, లక్సెట్టిపేట



మున్సిపల్, పంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తగ్గించడమే ఈ ప్రాజెక్టు ఉద్దేశం. ఇనుపరాడ్లు, చువ్వలు, బాల్‌రింగ్‌లు, గొలుసులు, టైర్లు, సోలార్ ప్యానెల్, లైట్ మొదలైన వాటితో తయారు చేసిన సాధారణ యంత్రం. పారిశుధ్య కార్మికుల పనిని సులభతరం చేయటానికి, వ్యర్థకణాలతో టచ్ కమ్యూనికేషన్‌ను తగ్గించటానికి ఉపయోగపడుతుంది.

జాతీయస్థాయిలో రాణించాలి

జిల్లా నుంచి ఎంపికైన విద్యార్థులు జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ పోటీల్లో రాణించాలి. అత్యుత్తమ ప్రదర్శన చేసి టాప్ 60లో స్థానం సాధించి జాతీయ అవార్డు కైవసం చేసుకోవాలి. విద్యార్థులకు ఎస్కార్ట్‌గా టీచర్ వెళ్లారు. మణిప్రసాద్, ఖుషీంద్రవర్మకు ఆల్‌దిబెస్ట్.

– యాదయ్య, డీఈవో, మంచిర్యాల

దీపావళి బోనస్ రూ.85 వేలు

శ్రీరాంపూర్: బొగ్గు గని కార్మికులకు ఈసారి దీపావళి బోనస్(పీఎల్ఆర్) రూ.85 వేలు చెల్లించనున్నారు. ప్రతీ సంవత్సరం ప్రాఫిట్ లింక్డ్ రివార్డు కింద కోలిండియా దాని, సబ్సిడరీ కంపెనీలతోపాటు సింగరేణిలో ఉద్యోగులకు యాజమాన్యం ఈ మొత్తం చెల్లిస్తుంది. న్యూఢిల్లీలోని కోలిండియా భవన్‌లో ఆదివారం కోలిండియా యాజమాన్యంతో జాతీయ సంఘాలు పీఎల్ఆర్ బోనస్‌పై చర్చలు జరిపాయి. గతేడాది రూ.76,500 చెల్లించగా ఈసారి రూ.1.20 లక్షలు చెల్లించాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ మేరకు రూ. 85 వేలు చెల్లించడానికి యాజమాన్యం అంగీకరించిందని ఏఐటీయూసీ అధ్యక్షుడు వి.సీతారామయ్య తెలిపారు. ఈ డబ్బులు కోలిండియాలో దసరాకు చెల్లిస్తారు. సింగరేణిలో మాత్రం దీపావళి పండుగకు ముందు చెల్లిస్తారు. అందుకే దీనికి దీపావళి బోనస్‌గా సింగరేణిలో పేరు వచ్చింది. దీంతో సుమారు 3 లక్షల మందికి ప్రయోజనం చేకూరనుంది.

'పోరాటాలతోనే కాంట్రాక్టు కార్మికులకు హక్కులు'

రెబ్బెన(ఆసిఫాబాద్): ఎన్నో ఏళ్లుగా కనీస వేతనాలకు నోచుకోకుండా శ్రమదోపిడీకి గురవుతున్న సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు పోరాటాలతోనే హక్కులు సాధ్యమవుతాయని సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం (సీఐటీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబాల ఓదెలు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంట్రాక్టు కార్మికులకు వేతనాల పెరుగుదల, లాభాల వాటా ఒప్పందం అమలుకై ఈనెల 9న హైదరాబాద్ లోని లేబర్ కమిషనర్ కార్యాలయం ఎదుట, ఈనెల 13, 15 తేదీల్లో ఎమ్మెల్యేల ఇంటి ముందు నిర్వహించనున్న ధర్నాలో కాంట్రాక్టు కార్మికులు అధికసంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. 2021లో రాష్ట్ర ప్రభుత్వం జీవో 22ను విడుదల చేసి నేటి వరకు గెజిట్ చేయకుండా కార్మికుల పొట్టకొడుతోందన్నారు. పెరుగుతున్న నిత్యావసరాల ధరలతో సమానంగా వేతనాల్లో పెరుగుదల లేకపోవడంతో కార్మికులు మానసిక వేదనకు గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. కాంట్రాక్టు కార్మికుల వేతనాలు వెంటనే పెంచాలని, సింగరేణి లాభాల్లో కాంట్రాక్టు కార్మికులకు సైతం వాటా కల్పించాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

నల్లబెల్లం విక్రేతపై కేసు నమోదు

జన్నారం: నల్లబెల్లం, పటిక విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై రాబర్ట్ తెలిపారు. వివరాల ప్రకారం.. మండల కేంద్రంలో బెల్లం విక్రయిస్తున్నారనే ఎక్సైజ్ సీఐ సాయిబాబాకు వచ్చిన సమాచారం మేరకు ఆదివారం బండారు శివకుమార్ దుకాణంలో తనిఖీ చేసి 30కిలోల బెల్లం, 5కిలోల పటికను స్వాధీనం చేసుకున్నారు. శివకుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై తెలిపారు.

పటిక, బెల్లం పట్టివేత

వాంకిడి: మహారాష్ట్ర నుంచి అక్రమంగా తరలిస్తున్న నిషేధిత పటిక, బెల్లం పట్టుకున్నట్లు ఎస్సై సాగర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. దహెగాం మండలానికి చెందిన బానోత్ రమేష్ గుడుంబా తయారీకి ఉపయోగించే పటిక, బెల్లాన్ని టవేరా వాహనంలో మహారాష్ట్ర నుంచి తరలిస్తుండగా మండలంలోని కనార్గాం గ్రామ సమీపంలో పట్టుకున్నారు. వాహనంతో పాటు పటిక, బెల్లం సీజ్ చేసి నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మారుతినగర్ ఏరియాలోని ఓ ఇంట్లో పేకాటాడుతున్న వారిని పోలీసులు దాడి చేసి ఆదివారం పట్టుకున్నట్లు ఎస్సై చంద్ర కుమార్ తెలిపారు. ఈ దాడిలో తొమ్మిది మందిని పట్టుకుని వారి వద్ద నుంచి రూ.20వేలా70 నగదు, మూడు ద్విచక్ర వాహనాలు, ఐదు మొబైల్ ఫోన్స్ స్వాధీనం చేసున్నారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడిచే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గంజాయి విక్రేతల అరెస్టు

మంచిర్యాలక్రైం: గంజాయి విక్రయించేందుకు వచ్చిన ఇద్దరు యువకులను పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. ఎస్సై రాజేందర్ వివరాల ప్రకారం.. నస్పూర్ మండలం కృష్ణాకాలనీకి చెందిన పాగిడి శివకృష్ణ, శ్రీకార్ ఇద్దరు యువకులు బైక్‌పై వచ్చి ఆదివారం స్థానిక జాఫర్‌నగర్‌లో కొందరి యువకులకు విక్రయించేందుకు రాగా పక్కా సమాచారం మేరకు జాఫర్‌నగర్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరి యువకులను అదుపులోకి తీసుకునే ప్రయత్నంలో శ్రీకార్ అనే యువకుడు తప్పించుకోగా శివకృష్ణను అరెస్ట్ చేశారు. అతడి వద్ద రూ.5100 విలువ గల 204 గ్రాములు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. శివకృష్ణను విచారించగా మహారాష్ట్ర నుంచి గంజాయి తక్కువ ధరలకు కొనుగోలు చేసి ఇక్కడ ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నేత కార్మికుడి బలవన్మరణం


మొగిలి (ఫైల్)

మంచిర్యాలరూరల్ (హాజీపూర్): హాజీపూర్ మండలం కర్ణమామిడి గ్రామానికి చెందిన బోగ మొగిలి(44) నేత కార్మికుడు అప్పుల బాధకు తాళలేక బలవన్మరణానికి పాల్పడ్డాడు.. సంఘటనా వివరాలు ఇలా ఉన్నాయి.. కర్ణమామిడిలో నివాసం ఉంటున్న బోగ మొగిళి రాపల్లి గ్రామం రాజేశ్వర్‌రావుపల్లిలో 2019లో టెక్స్‌టైల్స్ కంపెనీలో శాంచల లోన్ తీసుకుని వ్యాపారం ప్రారంభించాడు. కరోనాతో ఉపాధి లేక వ్యాపారంలో నష్టం ఏర్పడింది. బ్యాంకు ద్వారా తీసుకున్న రుణం చెల్లించాలని ఒత్తిడి రావడంతో బట్టలు నేసే శాంచలను అమ్మి లోన్ పూర్తిగా కట్టేశాడు. ఉపాధి లేక కుటుంబ పోషణ భారంగా మారింది. ఆర్థిక ఇబ్బందులతో మొగిళి శనివారం రాజేశ్వర్‌రావుపల్లిలోని అద్దెకు తీసుకున్న టెక్స్‌టైల్ కంపెనీలోని ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య లావణ్య, కుమారుడు రాంసాగర్, కుమార్తె ప్రియాంక ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దోమ తెరలేవి?

''నా పేరు రాము.. మాది గాదిగూడ మండలంలోని లోకారి గ్రామం. రెండేళ్ల క్రితం మా నానమ్మకు జ్వరం వచ్చింది. ఆదిలాబాద్ రిమ్స్‌లో వైద్యం చేయించాము. డెంగీ నిర్ధారణ అయింది. రెండు రోజులు అక్కడే వైద్యం చేయించాం. నాల్గో రోజు చనిపోయింది. గప్పుడు నా ఇంటికి వచ్చిన పెద్దసార్లు దోమ తెరలు ఇచ్చారు. మళ్లీ రెండేళ్ల నుంచి ఇవ్వలేదు.''

''నా పేరు సంజయ్.. నార్నూర్ మండలంలోని ఉమ్రీ గ్రామం. ఇటీవల కురిసిన భా రీ వర్షానికి గ్రామాల్లో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. చాలా మంది గ్రామాల్లో విష జ్వరంతో బాధ పడుతున్నారు. ఇప్పటికే రెండు డెంగీ కేసులు నమోదయ్యాయి. గతంలో ఇచ్చిన దోమ తెర చినిగిపోయింది. ఈ ఏడాది దోమ తెరలను పంపిణీ చేయాలి.''


నార్నూర్ మండలం భీంపూర్‌లో దోమ తెరలు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది(ఫైల్)

- ఏజెన్సీ పరిధిలో దోమల విజృంభన
- విస్తరిస్తున్న డెంగీ
- విషజ్వరాలతో ఇప్పటికే పలువురు మృత్యువాత
- ముందస్తు రక్షణ చర్యలు విస్మరించిన ఐటీడీఏ

మూడేళ్లుగా ఐటీడీఏ పరిధిలో నమోదైన డెంగీ, మలేరియా కేసుల వివరాలు

ఏడాది	మలేరియా	డెంగీ
2021	02	119
2022	02	123
2023	01	47

కేసులు తక్కువగా నమోదవుతున్నాయి...



ఏజెన్సీలోని మలేరియా పూర్తిగా అదుపులో ఉంది. ఇప్పటి వరకు రెండు కేసులు మాత్రమే నమోదయ్యాయి. డెంగీ కేసులు పెరుగుతున్నాయి. అందుకోసమే ఈ ఏడాది దోమ తెరలను పంపిణీ చేయడం లేదు. ప్రభుత్వం నుంచి పంపిణీ లేదు. ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తా. గతంలో పంపిణీ చేసిన దోమ తెరలను రెండు నుంచి మూడు సంవత్సరాల వరకు వాడుకోవచ్చు.
– శ్రీధర్, జిల్లా మలేరియా అధికారి, ఆదిలాబాద్

నార్నూర్: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలతో ప్రజలు డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ బారిన పడుతున్నా రాష్ట్ర ప్రభుత్వం దోమ తెరలను పంపిణీ చేయడం లేదు. ఏజెన్సీ ప్రాంతంలో 2017లో దోమతెరలు పంపిణీ చేసిన కుటుంబాల సంఖ్య ఆధారంగా మళ్లీ 2021లో దోమ తెరలు ప్రభుత్వం పంపిణీ చేసింది. కానీ ఈ రెండేళ్లలో దోమతెరలు పంపిణీ చేయకపోడంతో గిరిజనులు సీజనల్ వ్యాధులతో బాధపడుతున్నారు.

ఏజెన్సీలో... నమోదు

ఏజెన్సీలో మొత్తం 32ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. అందులో మొత్తం ఇప్పటి వరకు 47 డెంగీ కేసులు నమోదయ్యాయి. మలేరియా ఒక కేసు నమోదైంది. జిల్లా వ్యాప్తంగా 1.99 లక్షల మంది గిరిజనులు నివసిస్తున్నారు. వర్షాకాలం మొదలైందంటే గిరిజనులు దోమకాటుతో మలేరియా, టైఫాయిడ్ లాంటి జ్వరాల బారిన పడుతున్నారు. ప్రభుత్వం 2016లో జిల్లా వ్యాప్తంగా ఏజెన్సీ గిరిజనులకు దాదాపు 70వేల దోమ తెరలు పంపిణీ చేసింది. 14 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు 2017లో 40,400 దోమతెరలు అందించగా కుటుంబాల సంఖ్య ఆధారంగా 2021లోనూ అందజేసింది. ప్రస్తుతం వర్షాలు బాగా కురవడంతో దోమలు స్వైర విహారం చేస్తున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

అవగాహనేది..?

గిరిజన ప్రాంతాల్లో జ్వరాల తీవ్రతకు దోమ వ్యాప్తి కారణమని గుర్తించిన ప్రభుత్వం 2016 నుంచి ఇప్పటివరకు గిరిజన కుటుంబాలకు ఐటీడీఏ ద్వారా దోమ తెరలు అందించింది. 2016లో 70,859 దోమ తెరలను మలేరియా కేసులు అత్యధికంగా నమోదైనా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అందించింది. 2020లో అవే పీహెచ్‌సీలకు 70,859 దోమ తెరలను పంపిణీ చేయగా 2021లో 14 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు 40,400 దోమ తెరలను ఏజెన్సీ వైద్యశాఖ జిల్లా వ్యాప్తంగా అందించింది. నాణ్యత గల దోమ తెరలు కావడంతో నాలుగైదేళ్లపాటు వాడుకోవచ్చని అధికారులు తెలిపారు. అంతేకాకుండా ప్రతీ ఆరు నెలలకోసారి వీటిని దోమల నివారణ మందు డెల్టా మైత్రిన్‌లో వేసి శుభ్రం చేసుకోవడం ద్వారా ఎక్కువ కాలం మన్నికగా ఉంటాయని చెబుతున్నారు. కానీ చాలా చోట్ల అవగాహన లేమితో గిరిజనులు దోమ తెరలను శుభ్రం చేసుకోలేదు. దీంతో అవి అనతికాలంలోనే పాడైపోతున్నాయి. వాటి వాడకంపై సరైన అవగాహన కల్పించకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతోంది.

వరిలో చీడ, పీడల నివారణ చర్యలు


చీడ,పీడలు ఆశించిన వరి


వరిదుబ్బకు ఆశించిన సుడిదోమ పురుగులు


కవిత, ఏవో, చెన్నూర్

చెన్నూర్‌రూరల్: వరిలో ఆకుముడత పురుగు ఎక్కువగా వ్యాపిస్తుంది. అలాగే వాతావరణ మార్పులు చోటుచేసుకుంటుండడంతో అగ్గితెగులు, సుడిదోమ వ్యాపించే అవకాశం ఉంది. దీంతో దిగుబడులు తగ్గి రైతులు నష్టపోయే ప్రమాదం ఉంది. రైతులు చీడ,పీడల నివారణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ అధికారి కవిత తెలిపారు. అదే విధంగా ఆకుముడత పురుగు వరిలో ఎక్కువగా ఆశిస్తున్నట్లు వారు తెలిపారు. ఆకు ముడత పురుగు ఎక్కువగా వరి నాటిన నుంచి దాదాపు చిరుపొట్టదశ వరకు ఎక్కువగా ఆశించి నష్టం కలుగజేస్తుంది. చల్లని వాతావరణం ఈ పురుగుల సంతతని పెంచుకోవడానికి కారణమవుతోంది. అదేవిధంగా మోతాదుకు మించి నత్రజని వినియోగం ఈ పురుగు ఉధృతికి అనుకూలంగా మారనుంది. ఈ పురుగు వరి ఆకులను దగ్గరగా ముడుచుకుని పత్రహరితాన్ని గీకి తినడంతో ఆకులు తెల్లని చారలుగా మారుతాయి. దీనిని రైతులు ప్రాంతీయంగా తెల్లదెమ్మెడగా పిలుస్తారు.

ఆకులపై నూలుకండె ఆకారపు మచ్చలు ఏర్పడి వాటి చుట్టూ ఎర్రటి మధ్యలో గోధుమ రంగు గల మచ్చలు ఏర్పడుతాయి. క్రమేనా ఈ మచ్చలు ఒక దానితో ఒకటి కలిసి ఆకులు ఎండిపోతాయి. దూరం నుంచి పంటను చూస్తే కాలిపోయినట్లు కనిపిస్తుంది. పొట్ట దశ, ఈనె దశలో ఆశించినట్లయితే మెడ విరుపు వస్తుంది. తేలికపాటి జల్లులతో కూడిన చల్లని వాతావరణంతో పాటు సిఫార్సు చేసిన మోతాదుకంటే అధికంగా నత్రజని ఉపయోగించినట్లయితే అగ్గితెగులు ఉధృతి పెరుగుతుంది. గోధుమ, తెల్లని రంగులో పురుగులు కాండం మొదలు వద్ద చేరి రసం పీల్చి మొక్క ఎండిపోయేలా చేస్తుంది. దీంతో వరి సుడులు సుడులుగా ఎండిపోతుంది. వీటిని హపర్‌బర్న్ లక్షణాలు అంటారు. సుడి దోమకు వాతావణం అనుకూలించినట్లయితే ఒకటి నుంచి రెండు రోజుల్లో పొలం మొత్తం వ్యాప్తి చెందుతుంది.

నివారణ చర్యలు...

ఆకు ముడుతకు సిఫారసు మేరకు నత్రజని ఎరువులను వాడాలి. రసాయని చర్యలో భాగంగా క్లోరోఫైరిఫాస్ 400మిల్లీమీటర్లు లేదా ల్యామిడాసైహలోత్రిన్ 200లనుండి 250 మిలీ లీటర్లు ఆదే పురుగుల తీవ్రత ఎక్కువ ఉంటే క్లోరాంతనిప్రోల్ 60 మిల్లీ లీటర్లు లేదా ఫ్లుబెండామైడ్ 40–50 మిల్లీ మీటర్లు ఒక ఎకరానికి 200 మిల్లీ లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

అగ్గితెగులు..

ట్రై సైక్లోజోల్ 120 గ్రాములు లేదా కార్బన్‌డిజమ్ 200 గ్రాముల మందును 200 లీటర్ల నీటికి కలిపి ఒక ఎకరానికి పిచికారీ చేయాలి. సుడోమోనాస్ఫ్లోరిసెన్స్ అనే జీవశిలింధ్ర నాశిని 1కిలో 200 లీటర్ల నీటిలో ఎకరానికి పిచికారీ చేయాలి. సిఫార్సు చేసిన నత్రజని మోతాదునే వాడాలి.

సుడి దోమ..

డైనటో ఫ్యూరాన్ వంద గ్రాములు ఎకరానికి లేదా పైమెట్రోజైన్ 120 గ్రాములు ఎకరానికి పిచికారీ చేసి సుడి దోమను నివారించవచ్చు.

పవర్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు తీర్చాలి


మాట్లాడుతున్న నాయకులు

జైపూర్: పవర్ ప్లాంటు భూ నిర్వాసితులకు పర్మినెంట్ ఉద్యోగులు కల్పించాలని, స్థానిక కాంట్రాక్టు కార్మికులు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీఎంఎస్ ఆధ్వర్యంలో సోమవారం ఒక్కరోజు నిరసన దీక్ష చేపట్టనున్నట్లు బీఎంఎస్ ఎస్టీపీపీ కార్యనిర్వహణ అధ్యక్షులు పేరం రమేశ్, బీజేపీ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అందుగుల శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకలరు సమావేశంలో వారు మాట్లాడారు. పవర్ ప్లాంట్ ప్రభావిత ఎనిమిది గ్రామాల రైతులు, స్థానిక భూనిర్వాసితులు, కాంట్రాక్టు కార్మికులకు జరుగుతున్న అన్యాయంపైన బీఎంఎస్ పోరాన్ని చేపట్టనున్నట్లు వివరించారు. భూములు సేకరించిన సమయంలో అనేక హామీలు ఇచ్చిన సింగరేణి పవర్ ప్లాంటు నిర్మించిన తర్వాత వాటిని పూర్తిగా విస్మరించిందని, నాడు చేతుల నిండా పనితో ఉన్నా రైతులు, నేడు పవర్ ప్లాంటులో కూలీలుగా పని చేస్తున్నారని తెలిపారు. కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారం, భూనిర్వాసితుల పర్మినెంట్ ఉద్యోగాల సాధనకై చేపట్టే ఒక్క రోజు నిరసన దీక్షను, వంటా వార్పు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో ఎస్టీపీపీ బీఎంఎస్ అధ్యక్షులు చినూరి రాజేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి దుస్స భాస్కర్, జిల్లా కార్యదర్శి రాజుయాదవ్, ఈగ సురేందర్, బీజేపీ పార్టీ మండల అధ్యక్షులు చల్ల విశ్వంభర్‌రెడ్డి ఉన్నారు.

సీఈఆర్ క్లబ్‌లో ఇండోర్ గేమ్స్


క్యారమ్ ఆడుతున్న క్రీడాకారులు

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని సీఈఆర్ క్లబ్‌లో ఆదివారం డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ ఆధ్వర్యంలో ఏరియా స్థాయి క్యారమ్స్, షటిల్, టేబుల్ టెన్నిస్, చెస్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఏరియా కేకే–5 గని మేనేజర్ భూశంకరయ్య ప్రారంభించారు. ఈ పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ సింగరేణిలో గేమ్స్‌కి ఎంతో ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఏరియా స్థాయి పోటీల్లో గెలుపొందిన వారు మిగిలిన పోటీల్లో రాణించి ఏరియాకు గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడల కార్యదర్శి కార్తీక్, సమన్వయకర్త రవికుమార్ పాల్గొన్నారు.

బ్యాంకు దొంగతనం కేసు ఛేదించిన పోలీసులు

- గుడ్ బ్యాంకు అని కితాబ్ ఇచ్చిన దొంగ అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న బెల్లంపల్లి రూరల్ సీఐ

నెన్నెల: మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో రెండుసార్లు చోరీకి విఫలయత్నం చేసిన నిందితుడిని ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. బెల్లంపల్లి రూరల్ సీఐ రాజ్‌కుమార్, ఎస్సై శ్యాంపటేల్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ప్రైవేట్ టీచర్‌గా, కస్టమర్ సర్వీస్ సెంటర్ మినీ ఏటీఎం నిర్వాహకుడిగా పనిచేసే బాపు ఆన్‌లైన్‌లో పేకాటకు అలవాటు పడి ఆర్థికంగా నష్టపోయాడు. మొదటిసారి ఆగస్టు 31న బ్యాంకులో దొంగతనానికి వచ్చి నగదు ఏమి దొరకకపోవడంతో గుడ్ బ్యాంకు, ఒక్క రూపాయి కూడా దొరకలేదు. నా ఫింగర్‌ప్రింట్ కూడా ఉండదు. నన్ను పట్టుకోవద్దు అని బ్యాంకు మేనేజర్ టేబుల్‌పై ఉన్న పేపర్‌పై మార్కర్‌తో రాసి వెళ్లడంతో అది వైరల్‌గా మారింది. మరోసారి నెల రోజుల తర్వాత సెప్టెంబర్ 30న బ్యాంకు కిటికి గ్రిల్‌ను తొలగించిలోనికి ప్రవేశించాడు. అలారం మోగడంతో భయపడి టార్చ్‌లైట్‌లా ఉపయోగించేందుకు తెచ్చుకున్న సిమ్‌కార్డులేని చిన్న ఫోన్‌ను అక్కడే వదిలేసి పారిపోయాడు. ఆ సెల్‌ఫోన్‌నే దొంగను పట్టుకునేందుకు ఉపయోగపడింది. ఐఎంఈఐ నంబర్ ఆధారంగా బాపును పట్టుకున్నారు. గతంలో ఇతడిపై దేవాపూర్, రెబ్బె న, మాదారం, కన్నెపల్లి, మందమర్రి, తిర్యాణి పో లీస్‌స్టేషన్‌లో 13 కేసులు నమోదు అయ్యాయని సీ ఐ తెలిపారు. సర్వీస్ సెంటర్‌కు వచ్చే నిరక్షరా స్యు ల వేలిముద్రలు తీసుకొని వారి డబ్బులు తన అకౌ ంట్‌కు బదిలీ చేసుకుని మోసం చేసిన కేసులు ఉన్నారు. నిందితుడిని పట్టుకున్న సిబ్బందిని సీఐ అభినందించారు.

చెట్టును ఢీకొన్న ఆటో..

- ఒకరు మృతి.. పలువురికి గాయాలు


కొండయ్య మృతదేహం

జన్నారం: ఆటో అదుపుతప్పి చెట్టును ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతిచెందగా పలువురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని తపాలపూర్ గ్రామ సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై సతీశ్ వివరాల ప్రకారం ... ఉట్నూర్ మండలం లక్కారం గ్రామం గంగన్నపేటకు చెందిన బొర్లకుంట కొండయ్య(47) ఆదివారం సొంత పనుల నిమిత్తం లక్సెట్టిపేటకు వెళ్లాడు. పని ముగించుకుని ఇంటికి ఆటోలో తిరిగివస్తుండగా మండలంలోని తపాలపూర్ అటవీ చెక్‌పోస్టు దాటాక వంతెన దాటే క్రమంలో ముందు వెళ్తున్న ఆటోను ఓవర్‌టెక్ చేయబోయి పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో అందులో ప్రయాణిస్తున్న కొండయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. ఆటోలో ప్రయాణిస్తున్న తపాలపూర్ గ్రామానికి చెందిన వరలక్ష్మి, విజయ, కుషిత్‌లకు స్వల్పగాయాలయ్యాయి. కొండయ్య మేస్త్రీ పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆయనకు భార్య, ముగ్గురు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. భార్య మల్లవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

మందమర్రిరూరల్: ఉరేసుకుని మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పట్టణంలోని యాపల్ ప్రాంతంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై చంద్రకుమార్ వివరాల ప్రకారం... ముదిరకొండ రాధ(45) భర్త రవీందర్ పదేళ్ల క్రితమే చనిపోగా యాపల్ ప్రాంతంలోని తన తల్లిదండ్రుల వద్ద ఉంటుంది. తల్లిదండ్రులు సైతం రెండేళ్ల క్రితమే చనిపోవడంతో అప్పటి నుంచి ఒంటరిగా ఉంటోంది. అనారోగ్య సమస్యలతో పాటు ఆర్థిక ఇబ్బందులు, ఒంటరితనం తట్టుకోలేక ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

అ'పూర్వ' కలయిక


పూర్వ విద్యార్థులు

- 21ఏళ్ల తరువాత కలుసుకున్న బాల్య మిత్రులు
- చదువు నేర్పిన గురువులకు ఘన సన్మానం

చెన్నూర్: చెన్నూర్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2002 సంవత్సరం 10వ తరగతి కలసి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం మైనార్టీ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో కలుసుకున్నారు. ఒకటి నుంచి పది వరకు కలిసి చదుకున్న మిత్రులందరూ వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. 21ఏళ్ల తరువాత కలుసుకున్నారు. ఒకరికి ఒకరు ఆలింగనం చేసుకొని యోగక్షేమాలను తెలుసుకున్నారు. ఆనంతరం విద్యా బోధన చేసిన గురువులు కారెంగుల రామయ్య, కొమ్మెర లక్ష్మణ్, శ్రీనివాస్, వై.సత్యనారాయణ, గిరీశ్‌లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నిర్వహకులు రెవెల్లి మహేశ్, చింతల లక్ష్మణ్, వెల్పుల పోచం, నహీమ్, జుల్ఫికర్‌లతో పాటు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.


సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు

నస్పూర్: పట్టణ పరిధిలోని నస్పూర్ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలకు 1997–98 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. మంచిర్యాలలోని రామ సుధ రెసిడెన్సి ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొని ఒకరిని ఒకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యనారాయణ, శంకర్‌రావు, విద్యార్థులు గడ్డం సత్యగౌడ్, సురిమిల్ల రాజశేఖర్, బండం గోపాల్, రమేశ్, పెట్టెం తిరుపతి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

13 నుంచి జోనల్‌స్థాయి పోటీలు


నివాళులర్పిస్తున్న ఆర్సీవో, ప్రిన్సిపాళ్లు

బెల్లంపల్లి: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బెల్లంపల్లి బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీఓఈ)లో ఈనెల 13 నుంచి జరగనున్న 9వ జోనల్ స్థాయి క్రీడాపోటీలను సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆర్సీఓ స్వరూపరాణి అన్నారు. ఆదివారం సీఓఈ కళాశాల క్రీడా పోటీల వేదిక అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాళ్లతో సమీక్ష సమావేశంలో మాట్లాడారు. క్రీడల నిర్వహణకు తక్కువ సమయంలో వేగవంతంగా మైదానాన్ని అభివృద్ధి చేశారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఐనాల సైదులును అభినందించారు. అలాగే విద్యార్థులకు వసతి, ఆహారం ఇతరాత్ర సౌకర్యాల కల్పనలో సంబంధిత కమిటీల ఇన్‌చార్జీలు సత్వరం పనులు పూర్తిచేయాలని సూచించారు. అంతకుముందు ఆదిలాబాద్, కుమురం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల డీసీఓలు శ్రీనివాస్, బాలరాజు, బాలభాస్కర్ ఆధ్వర్యంలో పలు కమిటీలను ఆర్సీఓ ఏర్పాటు చేసి బాధ్యతలు అప్పగించారు. ప్రిన్సిపాల్ సైదులు అధ్యక్షతన ఫుడ్, ఫైనాన్స్, కల్చరల్ తదితర 22 కమిటీలను ఏర్పాటు చేశారు. క్రీడాపోటీల నిర్వహణను ఏ లోటు లేకుండా పూర్తిచేయాలని ఆదేశించారు. సమావేశంలో ప్రిన్సిపాళ్లు సంధ్యారాణి, సంతోష్‌కుమార్, వినోద్, సాదా, జ్యోతి, స్వరూప, లలితకుమారి, సీనియర్ అధ్యాపకులు మహేశ్వర్‌రావు, రమేశ్, ఎల్లయ్య, కోట రాజ్‌కుమార్, ప్రమోద్‌కుమార్, రాజ్‌కుమార్, దత్తప్రసాద్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి


గంగాధర్ మృతదేహం

దండేపల్లి: మండలంలోని కాసిపేటకు చెందిన కల్లెం గంగాధర్(36) గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఎస్సై ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. గంగాధర్ రెండేళ్లుగా మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్నాడు. ఆసుపత్రులు తిరిగిన నయం కాకపోవడంతో జీవితంపై విరక్తితో ఈ నెల 3న గడ్డిమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు లక్సెట్టిపేట ప్రభు త్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అన్ని నియోజకవర్గాల్లో పోటీ చేస్తాం


మాట్లాడుతున్న నాయకులు

పాతమంచిర్యాల: నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ తెలంగాణలోని అన్ని నియోజకవర్గాల్లో తమ అభ్యర్థులను పోటీలో నిలుపుతామని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుమ్మిడి గోపాల్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థుల జాబితాను త్వరలోనే ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు నట్టపెల్లి మహేష్, జిల్లా అధ్యక్షులు నీలం సురేందర్, నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు పూరెళ్ల నితిన్, యూత్ అధ్యక్షులు జాడి సురేందర్ పాల్గొన్నారు.

నేడు కాంట్రాక్ట్ కార్మికుల ధర్నా

మందమర్రిరూరల్: సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు తీర్చాలని నేడు హైదరాబాద్‌లోని రాష్ట్ర లేబర్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ధర్నా కార్యక్రమానికి అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు. సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికుల శ్రమను యాజమాన్యం దోచుకుంటుందని ఆరోపించారు. శ్రమకు తగిన వేతనాలు ఇవ్వడం లేదని మండిపడ్డారు. కాంట్రాక్ట్ కార్మికుల శ్రమ దోపిడీతోనే సంస్థకు వేలాది కోట్లు లాభాలు వస్తున్నాయని వివరించారు. కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల్లో వాటా చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు దశలవారిగా చేపట్టనున్నట్లు తెలిపారు. 13, 15 తేదీల్లో కోల్‌బెల్ట్ ప్రాంత ఎమ్మెల్యేల క్యాంపు ఆఫీస్‌ల వద్ద ఆందోళనలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

వివాహిత ఆత్మహత్య

రామకృష్ణాపూర్: భర్త వదిలేశాడనే మనస్తాపంతో ఓ వివాహిత పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. పట్టణ ఎస్సై రాజశేఖర్ వివరాల ప్రకారం... సీసీసీకి చెందిన నర్మద (24) రామకృష్ణాపూర్‌లో ఉండే ఓ వ్యక్తిని గతంలో ప్రేమించి పెళ్లి చేసుకుంది. వారి మధ్య మనస్పర్థలు రావడంతో వేర్వేరుగా ఉంటున్నారు. గత సంవత్సరం 2022లో మందమర్రి మండలంలోని పులిమడుగుకు చెందిన రాజేష్ అనే వ్యక్తిని నర్మద రెండో పెళ్లి చేసుకుంది. ప్రస్తుతం రాజేష్‌తో విభేదాలు రావడంతో వేర్వేరుగా ఉంటున్నారు. దీంతో మనస్తాపానికి గురైన నర్మద పులిమడుగులోని రాజేష్ ఇంటి సమీపంలో ఆదివారం పురుగుల మందు తాగింది. స్థానికులు మంచిర్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.